భక్తి ఉద్యమంతో కళలను కాపాడుకుందాం..!

'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్ర సదస్సులో ఉద్ఘాటన

ప్రజాశక్తి - తిరుపతి సిటి 'జానపద కళలను భవిష్యత్ తరాలకు అందించేందుకు కళాకారులు చేయిచేయి కలిపి కళలను కాపాడుకునేందుకు కంకణబద్దులు కావాలి' అని వక్తలు ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట విద్వేషాలు మాని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి ఆధ్వర్యంలో 'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్రస్థాయి సదస్సు మంగళవారం జరిగింది. ఈ సభకు జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంక్రాంతి వెంకటయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

సమానత్వాన్ని చాటుదాం
మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ

మతాల పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టడం కాదు. సమానత్వాన్ని పెంపొందించాలి. దేవుని ముందు అందరూ సమానమే. వ్యాపారాల కోసం దేవుని వాడుకోవద్దు. మతం, దేవుడి పేరును రాజకీయ వేదికల్లో వాడుకోవడం సరైనది కాదు. ప్రతి మనిషిలో దైవాన్ని చూడగలగాలి. ధర్మాన్ని పంచడమే మతం ముఖ్య ఉద్దేశం. ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

పాలకులు కళాకారులను ఆదుకోవాలి
బంగారు మురళి, జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిత్యం దైవ ప్రచారానికి పూనుకుని, సమాజంలో మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్న జానపద కళాకారులను పాలకులు ఆదుకోవాలి. కోట్లు సంపాదించే సినిమా వాళ్లకు రాయితీలు ఇచ్చే ప్రభుత్వం, కళాకారులకు కనీసం ఆలయాల్లో భజనలు చేసుకునే అవకాశం ఇవ్వకపోవడం దారుణం. అరాకొరా ఇచ్చిన అనేక షరతులు విధించడం సరైనది కాదు.

పిల్లలకు భక్తిమార్గాన్ని నేర్పించాలి
ఆంజనేయస్వామి, కాశీ అన్నపూర్ణస్వామి ఆశ్రయం నిర్వాహకులు

చేయి చేయి కలిపితేనే శబ్దం వస్తుంది. అందరూ కలిసి ఆరాధన చేస్తే భక్తి భావం ప్రజ్వరిల్లుతుంది. పిల్లలకు భక్తిమార్గాన్ని నేర్పించాలి. భక్తితోనే ముక్తి వస్తుంది. భక్తిభావంతో సమాజంలో ఆధ్యాత్మిక భావాన్ని పెంచుదాం.

ఉద్యమాలతో హక్కులు సాధిద్దాం :నూకరాజ్, కాకినాడ.

వ్యవస్థలను, పురాణాలను తిరగరాయలేం. సమాజాన్ని మంచి మార్గంలో నడిపించేందుకు కృషి చేద్దాం. హక్కులు అడుక్కుంటే రావు. ఉద్యమిస్తే సాధిస్తాం. ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెచ్చి కళాకారుల సమస్యలను పరిష్కరిద్దాం.

కళాకారులను ఆదుకోవాలి : కళావతి, జయభారత్ సంస్థ

నిరంతరం శ్రమిస్తూ, మరోపక్క కుటుంబ పోషణ చూసుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో పది మందికి మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్న జానపద కళాకారులను ఆదుకోవాలి. టిటిడి షరతులు లేకుండా ప్రతి కళాబృందానికి కనీసం ఏడాదికి ఒక్కసారైన అవకాశం కల్పించాలి. అందరూ ఐక్యంగా పోరాడి, కళాకారులకు అవకాశాలు సాదిద్దాం.

టిటిడిలో అవకాశం ఇవ్వాలి
భాస్కర్, గోవింద పిరామిడ్, తిరుపతి రూరల్.

టిటిడి అనుబంధ ఆలయాల్లో సైతం కళాకారులు తమ కళా ప్రదర్శనలు చేసుకునేందుకు టిటిడి పెద్దలు ఆలోచించి అవకాశాలు ఇవ్వాలి. టిటిడి వంటి సంస్థ సామన్యుడి గురించి పట్టించుకోకపోవడం సరైనది కాదు. అందరూ కలిసి ఐక్యంగా పోరాడి, కళా ప్రదర్శనలకు కళాకారులకు అవకాశం ఇప్పిద్దాం.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- **జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు**

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో అక్రమంగా టపాసుల తయారీ, సరఫరా, విక్రయాలపై ప్రత్యేక నిఘా చర్యలు ప్రారంభించామని బాణాసంచా వంటి పేలుడు పదార్థాలను ఇంట్లో నిల్వ చేయకూడదని, విస్తరిత ప్రదేశాల్లో ప్రభుత్వ ప్రామాణాల మేరకు ప్రత్యేక దుకాణాలలో మాత్రమే టపాసులు విక్రయించాలి జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ప్రతి టపాసుల షాపులో నీరు, ఇసుక వంటి అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలని తెలియజేశారు. అక్రమంగా టపాసులు విక్రయించినా, నిల్వ చేసినా డయల్ 112 లేదా కమాండ్ కంట్రోల్ సెంటర్ 94409 00005కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. దీపావళి పండుగ సందర్భంగా గతంలో జిల్లాలో చోటుచేసుకున్న అనేక ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని, ఈ ఏడాది టపాసుల విక్రేతలు అనుసరించాల్సిన ప్రత్యేక మార్గదర్శకాలను వివరించారు. దీపావళి పండుగ పూర్వీకుల శుభాశయాలను ప్రతిబింబిస్తూ జరుపుకోవాలని, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దీపావళి పండుగను అత్యంత ఆనందంతో జరుపుకోవడం అందరికీ ఇష్టం, అయితే ఈ పండుగ ఆనందాలను అపశ్రుతి కలగకుండా, జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమన్నారు. దీపావళి టపాసులు కాల్చేటప్పుడు ముఖ్యంగా పిల్లలు, పెద్దలు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. టపాసులు కాల్చే ప్రదేశం స్వేచ్ఛగా, బహిరంగంగా ఉండాలని, తగిన దూరం పాటించడంతో పాటు, పిల్లలను నిర్లక్ష్యం చేయకుండా పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలని విజ్ఞప్తి చేశారు.

టపాసుల విక్రేతలకు మార్గదర్శకాలు

టపాసుల వ్యాపారం చేసే దుకాణదారులు ప్రభుత్వ నియమాలకు కట్టుబడి ఉండాలని, నిషేధిత రసాయనాలతో తయారైన టపాసులను విక్రయించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. గ్రీన్ క్రాకర్స్ పేరుతో నిషేధిత టపాసులను అమ్మినా, నిల్వ ఉంచినా, రవాణా చేసినా చట్టపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులు పొందిన దుకాణదారులు మాత్రమే టపాసుల విక్రయానికి పాల్పడాలని సూచించారు. ఈ దుకాణాలు బహిరంగ ప్రదేశాల్లో సురక్షితంగా ఏర్పాటు చేసుకోవాలని, అలాగే దుకాణాల వద్ద నీరు, ఇసుక వంటి అగ్నిమాపక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ప్రజలకు తగు సూచనలు అందుబాటులో ఉంచేందుకు దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అనుమతులు పొందని గోడౌన్లు, నిల్వ కేంద్రాలు, టపాసుల తయారీ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్పీ తెలిపారు. భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా ఏ అనుమానాస్పద కార్యకలాపాలు జరిగినా వాటిపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజలు, దుకాణదారులు ఎవరైనా తమ పరిసర ప్రాంతాల్లో అక్రమ టపాసుల తయారీ, నిల్వ లేదా విక్రయాలు జరుగుతున్నాయని అనుమానం ఉన్నా లేదా ఏవైనా ప్రమాదకర చర్యలు చోటుచేసుకుంటాయన్న సమయంలో వెంటనే ప్రమాదాల నివారణకు డయల్ 112 లేదా చిత్తూరు కమాండ్ అండ్ కంట్రోల్‌సెంటర్ 94409 00005కి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ, ప్రజల సహాయ సహకారంతోనే ఈ పండుగ సురక్షితంగా జరుపుకునేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. దీపావళి పండుగకు ముందు నుంచే జిల్లా వ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని, టపాసుల దుకాణదారులు నియమాలకు లోబడిన మార్గదర్శకాలను పాటించాలనీ, ప్రజలు తమ కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా పండుగ జరుపుకోవాలని ఎస్పీ సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన
డీఆర్‌ఓ మోహన్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు చిత్తూరు జిల్లాకు జిల్లా రెవెన్యూ అధికారిగా కేటాయించబడిన కె.మోహన్ కుమార్ మంగళవారం మధ్యాహ్నం జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ ఛాంబర్‌లో పదవీ భాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌ను జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేశారు. పదవీ స్వీకరణ అనంతరం కాణిపాకం దేవస్థానంకు చేరుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. డిఆర్‌ఓకు వేద పండితులు వేద ఆశీర్వాదం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, వివిధ సెక్షన్‌ల సూపరింటెండెంట్‌లు, సిబ్బంది డిఆర్‌ఓను మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు.

డీఆర్‌ఓగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న మోహన్ కుమార్

'డిఆర్‌ఓ పుల్లయ్య' ఉత్తమ పనితీరు కనబరిచారు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: బదిలీ పై వెళుతున్న డిఆర్‌ఓ పుల్లయ్య జిల్లాలో ఉత్తమ పనితీరు కనబరిచి అంకిత భావంతో పనిచేశారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు. మంగళవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా రెవెన్యూ అసోషియేషన్, కలెక్టరేట్ యూనిట్ వారిచే బదిలీపై వెళుతున్న డిఆర్‌ఓ పుల్లయ్యకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్‌ఓ పుల్లయ్యకు ఆరోగ్య సమస్యలు వున్నా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కి భరోసాగా ఉంటూ అంకితభావంతో పనిచేశారని అభినందించారు. కలెక్టరేట్, వివిధ సెక్షన్ల పర్యవేక్షకులుతో అందరి అధికారులతో సమన్వయంతో కలసి పనిచేశారని తెలిపారు. ఎక్కడా ఏ కంప్లైట్ లేకుండా భాద్యతతో పనిచేశారని తద్వారా పరిపాలనలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా పాలన సజావుగా సాగేందుకు కృషి చేశారని తెలిపారు. ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు పై అధికారులకు పంపడం, ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అందే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేశారని తెలిపారు.



బదిలీపై వెళ్తున్న డిఆర్‌ఓ పుల్లయ్యను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్

గ్రామాల్లో పకడ్బందీగా పారిశుద్ధ్యం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం, మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టడం, పన్నుల వసూళ్ల సంబంధిత అంశాలపై ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆ దిశగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలను ఆదేశించారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో ఎంపిడిఓలు, ఈఓపిఆర్‌డిలతో ప్రజారోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, పారిశుధ్య నిర్వహణ, రక్షిత మంచి నీటి సరఫరా, పన్నుల వసూళ్ళు, సిసి రోడ్డుల పురోగతి, సచివాలయ తనిఖీ సంబంధిత అంశాల పై జిల్లా కలెక్టర్ జెడ్‌పి సీఈఓ రవికుమార్ నాయుడు, డిపిఓ పార్వతితో కలసి సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నదని, ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకునేలా పంచాయతీ సెక్రెటరీలకు దిశానిర్దేశం చేయాలన్నారు. పారిశుధ్య లోపం కారణంగా భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండేలా తాగునీటి ట్యాంక్‌లను ప్రతి 15రోజులకోసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. కలరా, డయేరియా, హెపటైటిస్, టైఫాయిడ్ వంటి వ్యాధులకు కారణమైన బాక్టీరియా, వైరస్‌లు నీటి ద్వారానే వ్యాప్తి చెందుతాయని, ఈ వ్యాధులు ప్రబలకుండా ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రెటరీలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వీటితో పాటు బహిరంగ మలమూత్ర విసర్జన, తాగునీటి పైపులు లీక్ అయి మురుగునీటితో కలవడం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, పారిశుధ్య లోపం, కలుషిత నీటిని తాగడం ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురవుతారన్నారు. క్రమం తప్పకుండా నీటిని శుద్ధి చేయడం, చెరువులు, తాగునీటి వనరులున్న ప్రాంతాలలో బహిరంగ మలమూత్ర విసర్జన అరికట్టాలన్నారు. ఎంపిడిఓలు తమ పరిధిలోని తాగునీటి ట్యాంకులను, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుద్ధి చేయించి జియో ట్యాగింగ్ ద్వారా ఫోటోలు, వీడియోలను రికార్డు చేయాలని, తదనంతరం వీటిని పరిశీలించడం జరుగుతుందన్నారు. పంచాయతీ సెక్రెటరీలు ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకుని వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

పారిశుధ్యంపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

జిల్లాలో 15,66,502 ఓటర్లు: జిల్లా రెవెన్యూ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

జిల్లాకు సంబంధించి 2025 ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయడం జరిగిందని, ముసాయిదా జాబితా ఏఆర్‌ఓలు, పోలింగ్ కేంద్రాలు, బిఎల్‌ఓల వద్ద అందుబాటులో ఉంటాయని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్‌ఓ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితా విడుదలపై డిఆర్‌ఓ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం అనంతరం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ - 2025లో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయడం జరిగిందన్నారు. అక్టోబర్ 29 నుండి నవంబర్ 28వ తేదీ వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని తెలిపారు. నవంబర్ 10, 11, 23, 24వ తేదీలలో ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయడానికి కళాశాలలు, గ్రామ, మండల స్థాయిలో స్వీప్ యాక్టివిటీ నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 12 లోపు క్లెయిములు, అభ్యంతరాలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా విడుదల చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,269 పోలింగ్ లొకేషన్స్‌లో 1,776 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. పురుష ఓటర్లు 7,71,264, స్త్రీ ఓటర్లు 7,95,165, హిజ్రాలు 73 మొత్తం 15,66,502 ఓటర్లు ఉన్నారన్నారు. సర్వీస్ ఓటర్లకు సంబంధించి 3,214 మంది పురుషులు, 92 మంది స్త్రీలు మొత్తం 3,306 మంది ఉన్నారని, విభిన్న ప్రతిభావంతుల 23,503, 18నుంచి 19 సంవత్సరాల మధ్య 19,544 మంది ఓటర్లు ఉన్నారన్నారు. సమావేశంలో సిపిఎం వాడ గంగరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పరదేశి, ఆమ్ ఆద్మీ పార్టీ బాలసుబ్రమణ్యం, బహుజన్ సమాజ పార్టీ భాస్కర్, బిజెపి అట్లూరి శ్రీనివాసులు టిడిపి వి.సురేంద్ర కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితా ముసాయిదాను విడుదల చేస్తున్న డిఆర్‌ఓ పుల్లయ్య

కరువు మండలాలు ప్రకటన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కరువు జిల్లాలను ప్రకటించింది. చిత్తూరు జిల్లాలో 16 మండలాలను పేర్కొంది. పెనుమూరు , యాదమరి, గుడిపాల, ఎస్ఆర్ పురం, చిత్తూరు ,శాంతిపురం, రొంపిచర్ల ,పూతలపట్టు, సోమల ,పుంగనూరు, పలమనేరు ,బైరెడ్డిపల్లి, గుడిపల్లి, కుప్పం, రామకుప్పం వెంకటగిరి మండలాలను కరువు మండలాలుగా పేర్కొంది.

ఖోఖో విజేతలకు రూ.లక్ష ఆర్థికసాయం

విరాళాన్ని అందిస్తున్న చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్రస్థాయి 43వ సబ్ జూనియర్స్ ఖోఖో పోటీల్లో విజేతలకు చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించి ఉదారతను చాటుకున్నారు. జిల్లాలోని పూతలపట్టు నియోజకవర్గం కాణిపాకం అగరంపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో రాష్ట్రస్థాయి 43వ సబ్ జూనియర్ ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీలు ముగింపు వేడుకలకు చిత్తూరు ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపి ఖోఖో పోటీల్లో విజేతలకు తనవంతుగా ఆర్థికసాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు బాలుర విభాగంలో ప్రథమ స్థానం నిలిచిన ప్రకాశం జిల్లా జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణాజిల్లా జట్టుకు రూ.7500లు, బాలికల విభాగంలో ప్రథమస్థానం కైవసం చేసుకున్న తూర్పుగోదావరి జిల్లా జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన శ్రీకాకుళం జిల్లా జట్టుకు రూ.7500లు, అలాగే బాలుర విభాగంలో మూడోస్థానంలో నిలిచిన విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు చెందిన జట్టులకు రూ.5వేలు, బాలకల విభాగంలో మూడో స్థానంలో నిలిచిన ప్రకాశం, నెల్లూరు జిల్లా జట్టులకు రూ.5వేలు, ఖోఖో క్రీడాకారుల శిక్షణ కోసం మరో రూ.40వేలు అందజేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈమేరకు మంగళవారం చిత్తూరు ఎంపీ కార్యాలయంలో చిత్తూరు జిల్లా, డిఎస్‌డిఓ బాలాజీ, కోచ్ రాజేష్‌లకు ఎంపీ నగదును అందజేశారు. ఈ ప్రోత్సాహ నగదును తన రాధే కన్స్ట్రక్షన్స్ ద్వారా అందిస్తున్నానని, క్రీడలకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కాజుర్ శీన, సీనియర్ క్రీడాకారులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ మొదటి వారంలో నైపుణ్య గణన

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన సర్వే జిల్లాలో నవంబర్ మొదటి వారంలో ప్రారంభించటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నైపుణ్య గణనపై జిల్లా కలెక్టర్ ఎంపిడిఓలు, సంబంధిత అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, మున్సిపల్ స్థాయిలో ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో నైపుణ్య గణనపై సచివాలయం ఉద్యోగులకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. సర్వేలో 15 నుంచి 59 సంవత్సరాల వయసు గల వారి నుంచి సమగ్ర సమాచారం తీసుకోవడం జరుగుతుంది, దీని ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గ్రామ సచివాలయాలు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఇతర శాఖల సిబ్బంది స్కిల్ సెన్సస్ సర్వేలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరచటానికి వీలవుతుందన్నారు. ఆధార్ ఆధారిత ఓటిపి, బయోమెట్రిక్ ద్వారా యానిమరేటర్లు వివరాలను సేకరిస్తారని, ఓటీపీని బహిర్గతం చేసే విషయంలో ప్రజలు ఎలాంటి అపోహల గురికావద్దని సూచించారు. స్కిల్ సెన్సెస్ కోసం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ప్రత్యేకంగా రూపొందించిన నైపుణ్య యాప్ ద్వారా అభ్యర్థుల వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఒక్కో అభ్యర్థికి 70 నుంచి 80 ప్రశ్నలు నమోదు చేయాల్సి రావటంతో పది నిమిషాల వరకు సమయం పడుతుందని, ప్రజలు విద్యార్హత సర్టిఫికెట్లు ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగా సిద్ధం చేసుకుని ఉంటే సర్వే త్వరగా పూర్తిచేసే వీలు కలుగుతుందన్నారు. చిత్తూరు జిల్లాలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రతిఒక్కరూ సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు. జెడ్‌పి సీఈవో రవికుమార్ నాయుడు, జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మజ, ఏపిఎస్ ఎస్‌డిసి సీనియర్ మేనేజర్ ఎన్.శ్యామ్ మోహన్, డిఎస్‌డిఓ గుణశేఖర్, స్కిల్‌సెన్సెస్ మాస్టర్ ట్రైనర్ నాగభూషణం పాల్గొన్నారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయండి: జెడ్‌పి సీఈవో

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నవంబర్ 2వ తేదీ నుంచి అమలు చేయనున్న 'సమాజంలో అందరికి జీవితకాల అభ్యసన అవగాహన' కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించుటలో భాగంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు ఎంపిడిఓలు, సెర్ప్ ఎపిఎంలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జెడ్‌పి సిఈఓ రవికుమార్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం డిఆర్‌డిఏ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఉల్లాస్ ప్రోగ్రామ్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వయోజన విద్య ఏడి నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్‌పి సిఈఓ మాట్లాడుతూ ఉల్లాస్ ప్రోగ్రాం ప్రధాన ఐదు రకాల లక్ష్యాలలో భాగంగా క్రిటికల్ లైఫ్ స్కిల్ అంశం కింద ఎస్‌హెచ్‌జి గ్రూపు సభ్యులు, పాఠశాల, అంగన్వాడీ వంటవారు, ఆయాలు, సహాయకులు, వాచ్‌మెన్ వగైరా వర్గాల్లో గుర్తించిన చదువురాని నిరక్ష్యరాస్యులకు ఆర్థిక డిజిటల్, క్రియాత్మక ఆక్ష్యరాస్యతపై ఆవగాహన కల్పించుటకు మూడు సంవత్సరాల కాలం పాటు ఉల్లాస్ అక్ష్యరాస్యత కార్యక్రమం అమలు పరుచుటకు విధివిధానలు రూపొందించి కొత్త ఆక్షరాస్యత పథకాన్ని భారత ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు.

ఏపీఐఐసీకి భూములు కేటాయించడంపై
ప్రభుత్వానిదే తుది నిర్ణయం
ప్రజాభిప్రాయాలను ముఖ్యమంత్రికి పంపుతాం : జెసి



గ్రామసభలో ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

ప్రజాశక్తి విజయపురం (నగరి) మండలంలోని వీకేఆర్‌పురం గ్రామశివారుల్లో ఏపీఐఐసీకి కేటాయించిన భూముల్లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా ప్రభుత్వమే తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి తెలిపారు. ఈ గ్రామంలోని కొండల్లో క్రషర్లు ఏర్పాటు చేయడానికి 2018లో దరఖాస్తు చేసుకున్నవారు అనుమతుల కోసం జిల్లా కలెక్టర్‌ను సంప్రదించగా ప్రజాభిప్రాయ సేకరణ, పర్యావరణ కాలుష్య పరిశీలన నిమిత్తం క్రషర్లకు దరఖాస్తు చేసి ప్రాంతంలోనే గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో కొందరు గ్రామంలో క్రషర్లకు అనుమతి ఇస్తే పంచాయతీ రెవెన్యూ పెరుగుతుందని గ్రామం అభివృద్ధి అవుతుందని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, మరి కొందరు గ్రామంలో కాలుష్యం పెరుగుతుందని సూచించారు. ఏపీఐఐసీకి చెందిన అధికారులు మాట్లాడుతూ క్రషర్లకు దరఖాస్తు చేసుకున్న స్థలం ఎప్పుడో ఏపీఐఐసీ వారికి కేటాయించేశారన్నారు. ఈ ప్రాంతంలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు నిమిత్తం కొన్ని కంపెనీలు ముందుకు వస్తున్నాయని రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వారు వెనకడుగు వేస్తున్నారన్నారు. రోడ్డు ఏర్పాటులో గ్రామస్తులు సహకరించడం లేదని రోడ్డు ఏర్పాటుచేయిస్తే మిగిలిన పనులు తాము చేపడతామన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ విద్యాధరి మాట్లాడుతూ గతంలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములపై వారికే పూర్తి హక్కు ఉంటుందని దానిపై తాము స్వంత నిర్ణయాలు తీసుకోలేమన్నారు. ప్రజల అభిప్రాయాలను, ఏపీఐఐసీ వారి వివరణను రికార్డు చేయడం జరిగిందని దీనిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పంపుతామని వారు ఇచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆర్డీవో వెంకటరెడ్డి, తహశీల్దార్ రవికుమార్, ఎన్విరాన్‌మెంట్, మైన్స్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభానికి తొలగిన తీగలు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయపురం(నగరి): ఏరియా ఆసుపత్రి సమీపంలో విద్యుత్ స్తంభానికి చెట్ల తీగలు ఏపుగా అల్లుకొని ఉన్నాయి. దీంతో స్థానికంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడేది. ఈ విషయంగా మంగళవారం 'విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగ' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించి విద్యుత్ శాఖ అధికారులు తీగలను తొలగించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని దిగువ పల్లాలు పంచాయతీ ఆళ్ల మడుగు దళితవాడలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. సర్పంచ్ కామసాని భారతి పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చెత్తచెదారం తొలగింపు, నిల్వ నీటిని శుభ్రం చేయించారు. గ్రామాల సమీపంలో పెరిగిపోయిన చెత్తాచెదారంను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజ్, హౌసింగ్ ఇంజనీరింగ్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని కడపనత్తం గ్రామం శ్మశాన వాటిక దారి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తహశీల్దార్ మాధవరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. పూర్వం నుంచి ఉన్న వంక దారిని పక్క పొలం వాళ్లు ఆక్రమించడంతో దారి సమస్య తలెత్తిందని తెలిపారు. పరిశీలించి దారి కల్పించాలని గ్రామస్తులు తహశీల్దార్‌ని కోరారు. గ్రామస్తులు ధనపాల్ శెట్టి, ఇమాం సాబ్, చంద్ర, రామచంద్ర పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం

ప్రజాశక్తి-ఐరాల: మండలంలోని పొలకల పంచాయతీ తాళంబేడువారిపల్లి సహృదయ చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో మంగళవారం వృద్ధులకు అల్పాహారం అందజేశారు. మండలంలోని గోవిందురెడ్డిపల్లి పంచాయతీ నయనం పల్లికి చెందిన వినోద్, శిరీష దంపతుల కుమార్తె చెస్విక పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి, వృద్ధులకు పంచిపెట్టారు. అలాగే వృద్ధులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా సహృదయ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వి సుమతి మాట్లాడుతూ వృద్ధులకు అల్పాహారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

టపాకాయల దుకాణాల పరిశీలన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన టపాకాయల విక్రయ కేంద్రాలను మంగళవారం తహశీల్దార్ మాధవరాజు, ఎస్ఐ పరశురాముడు పరిశీలించారు. అధిక ధరలకు విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. భద్రతా ప్రమాణాలు పాటించి, తగిన జాగ్రత్తలు తీసుకొన్నాకే విక్రయాలు చేపట్టాలన్నారు.

బాలికలపై వేధింపులు..

- పలువురు బైండోవర్

ప్రజాశక్తి-పూతలపట్టు: రోడ్డుపై వచ్చి పోయే బాలికలను వేధింపులకు గురి చేస్తున్న పలువురు యువకులను మంగళవారం పూతలపట్టు పోలీసులు తహశీల్దార ఎదుట బైండ్ ఓవర్ చేశారు. మండలంలోని వడ్డీపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు ఈ దురాగతానికి పాల్పడుతుండగా పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సంబంధిత వారిని అదుపులోకి తీసుకొని బైండోవర్ చేశారు.

పెంచిన కరెంట్ చార్జీలను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడానికి వ్యతిరేకంగా మంగళవారం గాంధీ రోడ్‌లోని విద్యుత్ డివిజనల్ కార్యాలయం ఎదుట సిపిఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు మాట్లాడుతూ ఇప్పటికే అనేక పన్నుల రూపంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు అతలాకుతలానికి ఇబ్బందులు గురి అవుతున్న తరుణంలో ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచడం దుర్మార్గమని తీవ్రంగా విమర్శించారు.

ఎంపీకి బెయిల్.. సదుంలో సంబరాలు

ప్రజాశక్తి-సదుం: పుంగనూరులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిపై నమోదైన కేసుకు సంబంధించి మంగళవారం హైకోర్టులో ఆయనకు బెయిల్ లభించింది. దీంతో సదుం ఉప సర్పంచ్ పుట్టా మదన్ మోహన్ రెడ్డి(బాబురెడ్డి) ఆధ్వర్యంలో సదుంలో వైసిపి నాయకులు బస్టాండ్ కూడలిలో బాణాసంచా పేల్చి హర్షం వ్యక్తం చేశారు. స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అమరావతి పుట్రాజు, కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, యల్లా రెడ్డి, అన్నా రెడ్డి, రెడ్డివారిపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వాల్మీకి సంఘం నాయకులు రామాంజులు, హరి తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమాచార హక్కు చట్టంపై ప్రతికి అవగాహన ఉండాలని మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని కీరమంద, మంగళపల్లి, రాగిమానుపెంట గ్రామాలలో రైతులకు సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళి, వ్యవసాయ విస్తరణ అధికారి సాదరయ్య, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: 17ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వందన త్రిపాఠి, అధ్యాపకులు శ్రీనివాసులు, మురళి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా దళిత వాడలు

- సమస్యలు పరిష్కరించాలంటూ కమిటీ సభ్యుల డిమాండ్
- సమస్యలు, సమాధానాలతో ముగిసిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని దాదాపు అన్ని దళిత వాడల్లో సమస్యలు నెలవై ఉన్నాయని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటి సమావేశంలో సభ్యులు తెలిపారు. వాటి పరిష్కారానికి ఇప్పటికే అనేక సార్లు జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశాలలో కమిటీ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం కనిపించడం లేదన్నారు. ఇకనైనా దళితులపట్ల, దళితవాడల పట్ల నిర్లక్ష్య వైఖరి వీడనాడి అభివృద్ధికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం సోమల ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని సమావేశపు గదిలో తహశీల్దార్, ఎంపీపీ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ ఏపీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాబ్ కార్డు కలిగి ఉండాలని తద్వారా వందరోజుల పని దినాలను పూర్తి చేసుకునేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. జాబ్ కార్డు లేని వారు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్, టీఏను సంప్రదించి జాబ్ కార్డు పొందవచ్చునని తెలిపారు. హౌసింగ్ అధికారి జవిద్ మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో కాలనీలలో ఇండ్ల నిర్మాణాలు చేపట్టిన వారికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నామని అలా ఎక్కడైనా బిల్లులు రానివారు తమ దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరిస్తామని కోరారు. ఇరికిపెంట సర్పంచ్ రెడ్డప్ప మాట్లాడుతూ తమ పంచాయతీ పార్వతి నగర్ దళితుల శ్మశాన వాటిక ఆక్రమణ దారి ఆక్రమణ జరిగాయని ఈ నడింపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు లేక మూసివేయడంతో ఆక్రమణకు గురై ఉందని చెన్నపట్నం చెరువు ఎగువ తూము లీకేజీ కారణంగా నీరు వృధా అవుతున్నాయని సమావేశంలో తెలిపారు. తహశీల్దార్ బెన్ను రాజ్ మాట్లాడుతూ శ్మశాన వాటిక దారి ఆక్రమణ విషయాన్ని పరిశీలిస్తామని ఇరిగేషన్ అధికారులు సమావేశానికి రానందున చెరువు ఎగువ తూము లీకేజీ సమస్యను వారి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఎంఈవో శివరత్నమ్మ మాట్లాడుతూ మూతపడిన పాఠశాల ఆక్రమణ సరికాదని రికార్డులు పరిశీలించి ప్రహరీ గోడ నిర్మించి తిరిగి విద్యాశాఖ స్వాధీనం చేసుకుంటుందని హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు మంద రామనాథం మొగిలీశ్వరయ్య మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా శ్మశాన వాటికలు లేక దారి సమస్యలతో దళితవాడలు అభివృద్ధికి నోచుకోక ఉన్నాయని ప్రతి సమావేశంలోనూ తాము గొంతు పగిలేలా సమస్యలు విన్నవిస్తున్న అధికారులు స్పందించడం లేదని ఇకపై ఈ విధానాన్ని వీడనాడి దళితవాడలలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా భూ సమస్యలు కూడా ఉన్నాయని దళితుల భూములు పెత్తందారులు ఆక్రమించుకొని వారిని వేధింపులకు గురి చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మండల కేంద్రంలో అంబేద్కర్ భవన్ నిర్మాణానికి స్థలం చూపించి నిధులు మంజూరు చేసి భవనం నిర్మించాలని కోరుతున్నా పట్టించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ఇంకా పలు సమస్యలపై కమిటీ సభ్యులు అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా చూడాలని కోరారు. సమావేశానికి పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడం గమనార్హం. సమావేశంలో ఎంపీపీ ఈశ్వరయ్య, ఆర్ఐ కుత్బుతుల్లా, పలువురు కార్యదర్శులు వీఆర్వోలు ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వాడకం అదుపు చేయండి

- మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం
- పన్నుల వసూలులో రాష్ట్రంలో చివరిస్థానంలో ఉన్నాం
- మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్

ప్రజాశక్తి-విజయపురం(నగరి): మున్సిపల్ అధికారులు, సిబ్బంది విద్యుత్ వాడకాన్ని అదుపుచేయాలని మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ ఆదేశానుసారం అజెండాను మున్సిపల్ అధికారులు కౌన్సిల్‌కు చదివి వినిపించారు. అంజెండాలో పేర్కొన్న అంశాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఈ సందర్భంగా వార్డులో ఉన్న సమస్యలను కౌన్సిలర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం మాట్లాడుతూ మున్సిపాలిటీలో జనరల్ ఫండ్ చాలా లోటు ఉందన్నారు. ఆదాయం లేదన్నారు. ట్రాన్స్‌కోకు కట్టాల్సిన విద్యుత్ బకాయిలే రూ.6 కోట్లు ఉందన్నారు. వీటిలో నీటిసరఫరాకు ఉన్న 177 మోటార్లకు నెలకు రూ.18 లక్షలు చెల్లిస్తున్నామని, వీధి దీపాలకు నెలకు రూ.10 లక్షలు అవుతోందన్నారు. మరోవైపు ఈటీపీ ప్లాంటు నిర్వహణ చేపట్టిన వారు విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో అది గుదిబండగా మారిందన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి రావలసిన ఆస్థి పన్ను బకాయిలు రూ.4.30కోట్లు, నీటిపన్ను బకాయిలు రూ.2.09కోట్లు ఉందన్నారు. పన్ను వసూళ్లలో రాష్ట్రంలో చివరిస్థానంలో ఉన్నామన్నారు. కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో పన్నుల వసూలుకు సహకరించాలన్నారు. పన్నులు పూర్తిస్థాయిలో వసూలైతే చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలు చెల్లించి అభివృద్ధి పనులు కూడా చేపట్టవచ్చన్నారు. ఈటీపీ ప్రారంభంలో వేసుకున్న ఒప్పందం ప్రకారం డైయింగ్ యూనిట్ అసోసియేషన్ వారు దాని నిర్వహణ బాధ్యత చేపట్టాలన్నారు. అప్పుడే ఆ భారం మున్సిపాలిటీపై తగ్గుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, డీఈ రవీంద్రారెడ్డి, సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి సంబరాలు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: బిసిఎన్ విద్యాసంస్థలలో భాగమైన కుప్పం డిగ్రీ కళాశాలలో మంగళవారం ముందస్తు దీపావళి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రీ దివాలీ ఫెస్ట్ పేరుతో జరిగిన ఈ సంబరాలకు కళాశాలను ముస్తాబు చేశారు. ఈ సంబరాలలో కళాశాల ఉపాధ్యక్షులు సాగర్ రాజు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సత్యభామ శ్రీకృష్ణులు నరకాసురుని వధించి ముల్లోకాలకు సంతోషాన్ని తీసుకువచ్చిన ఆనందంతో దీపావళి పండుగ జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. నేటితరం విద్యార్థులకు మన సాంప్రదాయాలను గుర్తు చేయడానికి విద్యా సంస్థలలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చెక్ డ్యాం బిల్లు ఇవ్వండి ప్రభో!

- 2018నుంచి కాలయాపనా..
- బాధితుడు కుబేరస్వామి ఆవేదన

ఆవేదన వ్యక్తం చేస్తున్న కుబేరస్వామి

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని మాధవరం పంచాయతీ ఎం బోయపల్లికి గ్రామానికి చెందిన కుబేరస్వామి 2018లో నీరుచెట్టు పథకం ద్వారా చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారు. ఇందుకు గానూ ఇప్పటికీ బిల్లు పెండింగ్ పెట్టారని అధికారులు చొరవ తీసుకొని సొమ్ము ఇప్పించాలని నిర్మాణదారుడు కుబేరస్వామి కోరారు. మంగళవారం ఆయన విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పది లక్షలు మంజూరు చేసి అటవీ శాఖ ఆధ్వర్యంలో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. దీంతో పాటు చెక్‌డ్యాంకు ఇరువైపులా మట్టితోలకానికి అధనంగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఆ నిర్మాణ పనులను కాంట్రాక్ట్ పద్ధతిన తానే చేసినట్లు చెప్పారు. 2018లో నిర్మించిన ఈ చెక్‌డ్యాంకు నిర్మాణం పూర్తి చేయగా అటవీ అధికారులు కేవలం రూ.8.57లక్షలు మాత్రమే నిధులు మంజూరు చేశారని, మిగిలిన రూ.3.60లక్షలు పెండింగ్‌లో ఉంచారన్నారు. అప్పు చేసి నిర్మాణ పనులు చేపట్టగా ఆరు ఏళ్లు పూర్తయినప్పటికీ బిల్లు పెండింగ్‌లోనే ఉంచడం భావ్యం కాదన్నారు. అటవీ అధికారులను అడిగిన ప్రతిసారీ ప్రభుత్వం నుంచి రూ.300కోట్లు రావాలి, వస్తే ఇస్తాం.. తరువాత రండి.. అంటూ మాట దాట వేయడం సబబు కాదన్నారు. ఏళ్లకు ముందు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని కుబేరస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న చెక్‌డ్యాం బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అప్పుల బాధ భరించలేకున్నామని, అధికారులు స్పందించకుంటే ఆత్మహత్యే శరణ్యం అని కన్నీరు పెట్టుకున్నారు.

గ్రామంలో నాగుపాములు కలకలం

- భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-సోమల: సోమల పంచాయతీ భారతం మిట్ట గ్రామంలో ఇటీవల నాగుపాముల సంచారం అధికం కావడంతో గ్రామస్తులు భయాందోళనలతో బెంబేలెత్తుతున్నారు. వారం రోజుల క్రితం ఓ ఇంటిలోని వంటింట్లో మూడు రోజులుగా తిష్ట వేసిన ఏడు అడుగుల నాగుపామును చూసి కుటుంబ సభ్యులు పాములు పట్టే అతనిని పిలిపించి చాకచక్యంగా పామును పట్టించి ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం మరొకరి ఇంటిలో ఐదు అడుగుల నాగుపాము ఉండగా గుర్తించిన ఇంటిలోని వారు పాములు పట్టే అతనిని పిలిపించి పామును పట్టించేశారు. గత నెల రోజులుగా ఎవరో ఒక ఇండ్లలో నాగుపాములు ప్రత్యక్షం కావడం ఇంటిలోని వారు భయాందోళనలకు గురికావడం ఆపై పాములు పట్టే అతని పిలిపించి పట్టించడం జరుగుతూ వస్తోంది. ఇప్పటికే ఇండ్లలో చేరిన మూడు పాములను పట్టి దూర ప్రాంతాల్లో వదిలివేయడం జరిగింది. అప్పుడప్పుడు వీధుల్లో కూడా పాములు సంచరిస్తూ ఉన్నాయని ఎందుకు ఇలా జరుగుతోందో అర్థం కావడం లేదని గ్రామస్తులు అంటున్నారు. అదృష్టవశాత్తు ఎవరిని ఇంతవరకు పాములు కాటు వేయడం చేయలేదని అంటున్నారు. మళ్లీ ఇంకా ఎవరి ఇంటిలోనైనా పాములు ప్రత్యక్షమవుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

దయానంద, అధ్యక్షులు

భాస్కరయ్య, ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి-గంగవరం: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని సభ్యులు మంగళవారం ఎన్నుకున్నారు. గంగవరం యుటిఎఫ్ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీ.వి.రమణ హాజరైయ్యారు. సీనియర్ ఉపాధ్యాయులు రెడ్డెమ్మ, అంజప్ప, గురుమూర్తి సేవలను గుర్తించి, వారిని సన్మానించడం సంతోషకరమని జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి అన్నారు. అనంతరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు ప్రకాష్ ఎన్నికల అధికారిగా, క్రిష్ణమూర్తి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. గౌరవ అధ్యక్షులుగా గుణశేఖర్ రెడ్డి, అధ్యక్షులుగా దయానంద, సహాయ అధ్యక్షులుగా యేసు రక్షణ బేగం, ఎన్ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శిగా భాస్కరయ్య కోశాధికారిగా టి మురళి కృష్ణ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా ఆనందాచారి, షణ్ముగం శెట్టి, కోదండరామిరెడ్డి, శారద, హరి ప్రసాద్, శ్రీనివాసులు, చెన్న కేశవులు, అమీర్ వల్లి ఎన్నికయ్యారు. అదేవిధంగా జిల్లా కౌన్సిలర్లుగా దయానంద, భాస్కరయ్య, రాజేష్ రెడ్డి, బాబు, హరినాథ రెడ్డి, గీత, గురునాథం, మునిరాజా ఎన్నికైనారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా హరినారాయణ, సబ్ కమిటీ కన్వీనర్‌గా హరీష్ కుమార్, మహిళా కమిటీ కన్వీనర్‌గా లోకేశ్వరి, అకడమిక్ సెల్ కమిటీ కన్వీనర్‌గా యుగంధర్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ విద్యా రంగ అభివృద్ధికి, అవినీతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాబు, ప్రసన్న కుమార్, పలమనేరు డివిజన్ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు కృషి

- కడా పిడి వికాస్ మరమత్

ప్రజాశక్తి-కుప్పం టౌన్: సీఎం చంద్రబాబు ఆదేశాలతో కుప్పం నియోజకవర్గంలో పేదరిక నిర్మూలనకు చర్యలు చేపడుతున్నట్లు కడా పిడి వికాస్ మరమత్ తెలిపారు. మంగళవారం కుప్పం పట్టణంలోని కడా కార్యాలయం నందు పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం 50 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేసినట్టు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ముందుగా బస్టాండ్, పార్కు, పట్టణ పరిధిలోని ముఖ్య కూడలిలను సుందరీకరిస్తామన్నారు. అలాగే సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి నాలుగు వేల ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వ విద్యా సంస్థలు, విద్యార్థుల వసతి గృహాలు, రోడ్ల మరమ్మత్తులు వంటి అనేక పనులకు అంచనాలు వేసి ప్రభుత్వ అనుమతి కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వ అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రధానంగా ఎయిర్ ఫోర్ట్ నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం మండలం చందం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న శకుంతల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మార్కొండ నాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా మంగళం ట్రెండ్స్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో అండర్ 17 బాలబాలికల జిల్లా స్థాయి పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో బేస్ బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందించదగ్గ విషయం అన్నారు. నవంబర్ నెల 9, 10 తేదీల్లో గుంటూరు జిల్లాలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీలలో శకుంతల పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారి జిని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు లోకనాథం, ఉపాధ్యాయుల బృందం, కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

చిరుత పులి దాడిలో ఆవుకు తీవ్ర గాయాలు

- ఆవులపల్లి అటవీ ప్రాంతంలో ఘటన

గాయపడ్డ ఆవు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లి గ్రామానికి చెందిన బొంగు బాల రాజయ్య తన ఆవును ఆవుల పల్లె అటవీ ప్రాంతంలో మేతకు ఉదయం వదిలి వచ్చాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆవును ఇంటికి తోలుకు వద్దామని వెళ్ళగా ఆవు గట్టిగా అరుస్తూ ఉండడంతో సమీపంలోని రైతులతో కలిసి సంఘటన స్థలానికి వెళ్లే లోపు చిరుత పులి ఆవు గొంతు పట్టుకొని మనుషుల అలికిడి వినగానే పరారైందని రైతులు అంటున్నారు. అటు తర్వాత ఆవును ఇంటికి తీసుకువచ్చి ఆపై పెద్ద ఉప్పరపల్లిలోని పశువైద్యశాల వద్దకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం.

ఘనంగా సుమిత్ రాజ్‌కుమార్ వర్ధంతి

ప్రజాశక్తి-పూతలపట్టు: కర్ణాటక సూపర్ స్టార్ సినీనటుడు దివంగత సుమిత్ రాజ్ కుమార్ వర్ధంతి వేడుకలను మంగళవారం పూతలపట్టు మండల కేంద్రంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన చిత్రపటంతో పాటు మాజీ మాజీ వైస్ ఎంపీపీ దివంగత సుబ్బారెడ్డి చిత్రపటాన్ని కూడా ఏర్పాటుచేసి నివాళు లర్పించారు. ప్రజల నుంచి కూడా రాజ్ కుమార్ అభిమానులకు సహాయ సహకారాలు అందాయి.

ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎండోమెంట్ ఉపన్యాసం

ప్రజాశక్తి-కుప్పం టౌన్: ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఎండోమెంట్ ఉపన్యాసం ఇంగ్లీష్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య దొరస్వామి మాట్లాడుతూ మొదటి కాల్పనిక డిటెక్టివ్ కానప్పటికీ, షెర్లాక్ హోమ్స్ నిస్సందేహంగా బాగా ప్రసిద్ధి చెందాడు. 1990 నాటికి, 25,000 రంగస్థల అనుసరణలు, చలనచిత్రాలు, టెలివిజన్ నిర్మాణాలు, ప్రచురణలు డిటెక్టివ్‌ను కలిగి ఉన్నాయని వివరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న బెంగళూరు విశ్వవిద్యాలయం ఆచార్య చిత్రా పనిక్కర్ ఎండోమెంట్ ఉపన్యాసంలో ఒక సాంస్కృతిక విధానం షెర్లాక్ కథలు అనే అంశంపై కొన్ని కథలను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామలా, స్కూల్ డీన్ ఆచార్య శివకుమార్, శాఖాధిపతి ఆచార్య రాజేంద్ర ప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కిషోర్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాతూరు నత్తం గ్రామంలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రామానుజులు, వీఆర్వో గురివిరెడ్డి, సచివాలయ సర్వేయర్ మధు, టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, రైతులు పాల్గొన్నారు.

తవణంపల్లి: భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నట్లు తవణంపల్లి తహశీల్దార్ సుధాకర్ తెలిపారు. మండలంలోని ఈచినేరిలో ఆర్ఐ రమణ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ మురళీకృష్ణ సర్వేలో భాగంగా భూ సేకరణ, భూ సమస్యలకు సంబంధించి రైతులు, భూ యజమానుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

క్రైం కార్నర్

బెల్లం బస్తాలు సీజ్

- 10లీటర్ల సారా స్వాధీనం, ఊట ధ్వంసం

సారా స్థావరాలపై దాడులు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కేవీపురం దళితవాడ, చెరువు ప్రాంతంలోని సారా స్థావరాలపై స్థానిక పోలీసులు సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఎస్ఐ బలరాం ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించగా తయారీకి సిద్ధంగా ఉన్న 600లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఆయా ప్రాంతాల్లో 47బస్తాల నల్లబెల్లం, 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. బెల్లం130కిలోలు ఉండగా దాని విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. నాటు సారా కాచి విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోవిందరాజు, పోలీసులు జనార్ధన్, నరేష్, దాము, రామచంద్ర పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: స్కూల్ బస్సు ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలం లోని గుండ్లకట్టమంచి వద్ద చోటుచేసుకుంది. హెచ్ కానిస్టేబుల్ కిరణ్ కథనం మేరకు.. గుండ్ల కట్టమంచి గ్రామంలో ఒక ప్రైవేట్ స్కూల్ బస్సు రివర్స్ వస్తూ వెనుకనుంచి వృద్ధురాలు నాగమ్మ(78)ను ఢీకొంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మంగళవారం మృతి చెందింది. ఏఎస్ఐ రామచంద్రారెడ్డి కథనం మేరకు.. మండలంలోని తుంబ కుప్పం గ్రామానికి చెందిన ధర్మేంద్ర, యాదమరి మండలంకి చెందిన మమత(33) శనివారం బైక్‌పై బంగారుపాళ్యం నుంచి నలగాంపల్లికి వెళుతుండగా పెట్రోల్ పంప్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో మమత తలకు తీవ్ర గాయం అయింది. దీంతో అమెను బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రాణిపేట సీఎంసీ ఆసుపత్రి, అక్కడి నుంచి మళ్లీ చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం
చింతలవారిపల్లె (గ్రా॥), సోమల (మం॥)
చిత్తూరు జిల్లా
e-Procurement Tender
NIT No. TTD.18022/74/2022-EE 14 SEC-
Dt: 17.01.2022
దేవాలయ పున:నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు క్రింది వెబ్‌సైట్‌ను చూడగలరు.
https://tender.apeprocurement.gov.in
ఇట్లు... **ఆలయ ధర్మకర్త**

IN THE COURT OF THE PRIL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR.
H.M.O.P.No.129 of 2020
Between:
A. Mouli ....Petitioner
And:
K. Harshitha ....Respondent
NOTICE TO THE RESPONDENT
K. HARSHITHA,
W/o A. Mouli,
D/O K. Ramachandra,
Penugolakala Village,
Rayalpeta Post,
Peddapanjani Mandal,
Chittoor Dist.- 517 414.
Madam, please take notice that, the above case stands posted to **05-11-2024** for your appearance and to file your counter. You are therefore directed by the above said court to appear before the above court on **05-11-2024 at 10:30 a.m.** and represent the matter either in person or through your advocate. Failing which the matter will be decided exparte.
By order of the court
Sd/- D. KANNAIAH REDDY
Advocate for the petitioner.

MATTER FOR PUBLICATION BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT CHITTOOR
ARC.No.12 of 2024
Between:
Kapileswar Chits India Pvt. Ltd., Chittoor Rep., by its Branch Manager **..Disputant**
And:
M. Hari Prasad & others **..Opponents**
SUMMONS NOTICE TO OPPONENTS NO.2 and 3
To
2. V. Subramanyam, S/o Munirathnam, working as S.G. Teacher. Vejjupalli Village, G.D.Nellore Mandal, Chittoor District, residing at D.No. 6-31. Kothuru Village. Nellepalli Post. G.D. Nellore Mandal, Chittoor District.
3.K. Santhakumari, W/o Subramanyam, working as S.G. Teacher. Dasarapalli Village. G.D.Nellore Mandal, Chittoor District, residing at D.No. 6-31. Kothuru Village. Nellepalli Post, G.D. Nellore Mandal, Chittoor District
Sir Madam, Please take notice that the above Dispute case is posted to 16-11-2024 for your appearance. You may appear either in person or through an advocate on 16-11-2024 at 10.30 A.M. Without fail and file your objections, failing which the matter will be decided in your absence an ex party.
Hearing Date: 16-11-2024
Sd/-**SRI. K. SIVAJI**, B.A., LLB.,
ADVOCATE CHITTOOR

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE :: PUTTUR.
I.A.NO.322/2024
O.S.NO.59/2016
Between:
Venkatesan @ K.R. Mannappa Mudali.
...Petitioner/Plaintiff
Vs.
And:
C.G.Shanmugam (died) LR K. Kannemma and others **...Respondents/Defendants**
Chinnappa Mudali-R16, Periya Mudali-R17
...Respondents/Defendants
NOTICE TO R16 and R17 IN I.A.322/ 2024 BY PUBLICATION
To
1. Chinnappa Mudali, S/o Avanakshamma-R16.
2. Periya Mudali, S/o Avanakshamma-R17.
Both are residing at Selvavinayagar Street, K.V.R. Pet village, Nagari Mandal, Chittoor District.
Ref: I.A.322/2024 in O.S. 59/2016 on the file of Senior Civil Judge's Court, Puttur.
Sir/Madam,
Please take notice that the plaintiffs have filed I.A.322/2024 in OS.59/2016 to implead you as defendants 16,17 in the suit and the same is posted to 04.11.2024 for your appearance on that day at 10.30 a.m.,, before this Hon'ble Court either in person or through lawyer. If you fail to appear on that day, the matter will be decided exparte and next steps will be passed in the suit.
This is the order of this Hon'ble Court.
K. CHANDRA SEKARA REDDY, B.A., B.L.,
Advocate Puttur